## క్లుప్తంగా

### రక్షమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మొయినాబాద్‌రూరల్‌: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రక్షమైసమ్మ దేవాలయ అర్చకుడు అంజన్‌శాస్త్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్‌ రక్షమైసమ్మ దేవాలయానికి భక్తులు పొటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విచ్చేసిన భక్తులకు అమ్మవారికి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

### వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్‌: మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయం దేవాలయాల్లో గత మూడురోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో వివిధ గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌ సుధాకర్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ దొడ్డి శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి నర్సింలు, సభ్యులు అనిమి గణేశ్‌గౌడ్‌, తిరుపతియాదవ్‌, వెంకటేశ్‌, దొడల శివకుమార్‌, నాయకులు జాంగారి జంగయ్య, జగన్‌, జాంగారి రవి, సత్యంరెడ్డి, తుప్పరి శేఖర్‌, జంగయ్య, బాల నర్సింలు, మహేశ్‌యాదవ్‌, దొడల శ్రీనివాస్‌ యాదవ్‌, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

### బీసీ సేన గ్రామ కమిటీల ఎన్నిక

కొందుర్గు: జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో ఆదివారం బీసీ సేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభారాణి, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా లక్ష్మి, కార్యదర్శిగా నాగమణి ఎన్నికయ్యారు. అదేవిధంగా కాస్లాబాద్‌ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ, నాయకులు బాల్‌రాజు, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

### బుద్ధుడి బోధనలను ఆచరిద్దాం

కొందుర్గు: గౌతమ బుద్ధుడి బోధనలను అందరం ఆచరిద్దామని బీఎస్పీ మండల మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. బుద్ధుడి జయంతిని పురస్కరించుకొని మండలంలోని పర్వతాపూర్‌లో ఆదివారం బుద్ధ జ్ఞానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. బుద్ధుడు అహింసా మార్గంలో నడుచుకోవాలని సూచించారన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని సూచించిన మహనీయుడు గౌతమ బుద్ధుడన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్‌, విద్యాసాగర్‌, రాజు, భీమయ్య, కృష్ణ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

షాద్‌నగర్‌: పట్టణానికి చెందిన దంత వైద్యుడు కొమ్ము మహర్షి ఇటీవల హైదరాబాద్‌లో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం కన్స్యూమర్‌ కాన్ఫిడరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ) సంస్థ సభ్యులు షాద్‌నగర్‌ పట్టణంలో నివాసం ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి వెంకన్నబాబును వారు ఓదార్చారు. పరామర్శించిన వారిలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీంరెడ్డి, ఉపాధ్యక్షుడు ఏవీరావు, నాయకులు సత్యనారాయణ, నర్సింహారెడ్డి, యాదిరెడ్డి, రమణయ్య, రాంచందర్‌ తదితరులు ఉన్నారు.

# కొనుగోలు ప్రారంభించేదెన్నడో?

- సీజన్‌ దాటుతున్నా సర్దార్‌నగర్‌లో తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రం
- తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆవేదన
- పట్టించుకోని సంబంధిత అధికారులు



షాబాద్‌ మండలం సర్దార్‌నగర్‌లో తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రం

షాబాద్‌: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు పంటలకు నీరు అందక, మరోవైపు అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇవన్నీ పక్కకు పెడితే వరి కోతలు ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం తెరుచుకోకపోవడంతో మండలంలోని రైతులు పంటను మార్కెట్‌లో అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చేసేదేమీ లేక చివరకు దళారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోడంతో అన్నదాతలు అయోమయంలో పడిపోతున్నారు.

### పది రోజుల క్రితం మోకిలలో..

చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌, చేవెళ్ల, మొయినాబాద్‌, శంకర్‌పల్లి మండలాలకు సంబంధించి ప్రతి సంవత్సరం రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. శంకర్‌పల్లి మండలం మోకిల, షాబాద్‌ మండలం సర్దార్‌నగర్‌లో కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యం సేకరించేవారు. గత 10 రోజుల కిత్రం మోకిలలో ఏర్పాటు చేశారు. కానీ సర్దార్‌నగర్‌లో మాత్రం ఇప్పటివరకు ప్రారంభించలేదు. ఈ విషయమై ప్రశ్నిస్తే ఇందుకు సంబంధించి తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. సర్దార్‌నగర్‌లో కొనుగోలు ప్రారంభిస్తే చుట్టుపక్కల మండలాల రైతులకు ఎంతో మేలు జరిగేది. కాగా రైతులు బయటి మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.1,800ల నుంచి రూ.2,000ల వరకు వడ్లను అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,320లు ఉండగా, బోనస్‌ రూ.500లు కలిసి మొత్తం రూ.2,820లు వచ్చేదని, క్వింటాల్‌కు రూ.1,000ల వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 13 వేల ఎకరాల్లో వరిసాగు

చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ యాసంగి సీజన్‌లో 13వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మోకిలలో ఒక్కచోట మాత్రమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో మిగతా మూడు మండలాల రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని మండలాల రైతులు మోకిల కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావాలని అధికారులు చెబుతున్నారని, కానీ ట్రాన్స్‌పోర్ట్‌కే వేల రూపాయలు ఖర్చు అవుతుందని అన్నదాతలు వాపోతున్నారు. సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేట్‌ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1800లు విక్రయించగా, ఖర్చుల కింద మరో రూ.100 తగ్గించి రైతుకు క్వింటాల్‌కు రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.1000 నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సర్దార్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

### న్యాయం చేయాలి



వరి కొనుగోలు కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నాం. పండించిన పంటను బయటి మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నాం. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి న్యాయం చేయాలి.

–దండు యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

### కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



షాబాద్‌ మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతులకు బాసటగా నిలవాలి.

–గడిగె గజేందర్‌గౌడ్‌, భారతీయ కిసాన్‌ సంఘ్‌ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌

# అర్హులందరికీ పథకాలు అందిస్తాం

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌**

కొత్తూరు: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మండలంలోని వైఎంతండా, పులిచర్లకుంటతండా, సిద్ధాపూర్‌, ఎస్‌బీపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పథకాలను కేవలం పార్టీ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేసినట్లు ఆరోపించారు. కాగా కాంగ్రెస్‌ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తూ ప్రజాక్షేత్రంలో సభలు నిర్వహించి పారదర్శకంగా అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్‌ పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక విపక్షాలు తమ ఉనికిని కాపాడుకోవడానికి లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. కొద్దిగా ఆలస్యమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన ఎప్‌సెట్‌ ఫలితాల్లో 446 ర్యాంకు సాధించిన ఎస్‌బీపల్లి గ్రామానికి చెందిన దండు నందును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో మరింత నైపుణ్యం సాధించి రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్‌, ఎల్లారం శేఖర్‌రెడ్డి, అంబటి ప్రభాకర్‌, సురేశ్‌గౌడ్‌, వీరమోని దేవేందర్‌, ఎమ్మె సత్తయ్య, కొమ్ము కృష్ణ, రవీందర్‌రెడ్డి, జంగయ్య, సిద్దార్థరెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

# విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

**ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్‌**

షాద్‌నగర్‌: రైతులు విత్తనాల ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాద్‌నగర్‌ ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్‌ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలం నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం ప్రారంభించారన్నారు. అయితే విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. లైసెన్స్‌ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విధిగా వారి వద్ద రసీదు పొందాలని సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుకూలంగా మంచి దిగుబడినిచ్చే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు బీటీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గడ్డి మందు తట్టుకునే రకాలు అంటూ బీటీ విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించి వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. అనుమతి లేని విత్తనాలు కొనడం, అమ్మడం నేరమన్నారు. అదేవిధంగా గ్రామాలకు వచ్చి విత్తనాలు విక్రయించే వారి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# ప్రతీ ఒక్కరికి ఇళ్లు అందజేస్తాం



లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను అందజేస్తున్న నాయకులు

**కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు చేవెళ్ల స్వామి, బేగరి యాదయ్య**

షాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులైన ప్రతీ ఒక్కరికి అందజేస్తామని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు చేవెళ్ల స్వామి, బేగరి యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో గల అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతీ ఒక్కరికి అందేవిధంగా చూస్తామన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాంను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్ల రాఘవాచారి, మహిపాల్‌రెడ్డి, కిష్టయ్య, యూనిస్‌, అనసూయ, రజిత, నాయకులు రాంచందర్‌, శ్రీశైలం, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌, రాజమల్లు, మల్లేశ్‌, శ్రీహరి, ప్రవీణ్‌, జాని, శ్రీకాంత్‌, యాదయ్య, పుష్పమ్మ, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

### మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత శేఖర్‌రెడ్డి దంపతులు

చేవెళ్ల: ఆలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. చేవెళ్లలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన అత్తెల్లి సంజీవరెడ్డి, సువర్ణ కుమారుడు శేఖర్‌రెడ్డి 1 లక్ష 11 వేల రూపాయల విరాళం ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పెద్దఎత్తున చేవెళ్లలో మల్లన్న స్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, దాతల సహకారం అందించాలని కోరారు. అనంతరం దాతను వారు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని శ్రీమలయాల స్వామి ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్‌, ప్రణయ్‌, నాగరాజు, శివ, గోపి, శివశంకర్‌, శివానంద్‌, సంతోష్‌, ప్రకాశ్‌, మమత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

# క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి



క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌

**మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌**

నందిగామ: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆసక్తి గల యువకులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్‌ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో మంకాల శ్రీశైలం సహకారంతో నిర్వహిస్తున్న చేగూరు ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేగూరులో గతంలో ఎన్నోసార్లు క్రికెట్‌ టోర్నమెంటును నిర్వహించామని, కానీ ఇప్పుడు కేవలం జూనియర్స్‌ కోసమే నిర్వహిస్తుండటం అభినందించదగ్గ విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, అలాంటి వారు గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంటులో పాల్గొని తమ ప్రతిభను కనపర్చాలన్నారు. రన్నర్‌ టీంకు రూ.10వేలు, విన్నర్‌గా నిలిచిన టీంకు రూ.5వేలు నగదు అందజేయనున్నట్లు మంకాల శ్రీశైలం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరేందర్‌, శివ, సాములయ్య, శ్రావణ్‌, శ్రీను, రాజశేఖర్‌, శ్రీశైలం, నర్సింహ, ఖలేద్‌, రవి, శ్రీను, భీమేశ్‌, అరవింద్‌, మంగలి మహేశ్‌, సురేష్‌, శంకర్‌, క్రీడాకారులు వెంకట్‌చారి, వంశీ, కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.

# ఆటపాటలతో హాయిగా..

- విద్యార్థులకు నృత్యం, యోగ, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ
- నేటితో ముగియనున్న వేసవి శిబిరాలు



అజీజ్‌నగర్‌ పాఠశాలలో సమ్మర్‌ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్‌ మల్లయ్య



కనకమామిడి పాఠశాలలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని అన్ని జిల్లాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు సమ్మర్‌ క్యాంపులను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మండల పరిధిలోని కనకమామిడి, మున్సిపల్‌ పరిధిలోని అజీజ్‌నగర్‌ పాఠశాలల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 5 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు 19వ తేదీ సోమవారంతో ముగియనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటూ వివిధ అంశాల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు.

### విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా..

మండల, మున్సిపల్‌ పరిధిలోని ఆయా పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌ క్యాంపులలో విద్యార్థులకు యోగా–ధ్యానం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చదరంగం, ఇండోర్‌ గేమ్స్‌, టీఎల్‌ఎం తయారీ, ఆటలు, కర్రసాము, అభినయ గేయాలు, గ్రంథాలయ పుస్తకాలు చదవడం, నృత్యం, గణితంలో మెలకువలు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం అలవాట్లు, అందమైన చేతి రాత తదితర అంశాల్లో వారి ఆసక్తిని బట్టి ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. 15 రోజుల పాటు ఈ శిక్షణ నేటితో ముగియనుంది.

### అభినందనీయం



ఉచిత వేసవి శిబిరాల్లో ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. మున్సిపల్‌ పరిధిలోని అజీజ్‌నగర్‌ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌ క్యాంపులో దాదాపు 80–90 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వారి ఆసక్తిని బట్టి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆటలు, పాటలు, యోగా తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారాన్ని సరఫరా చేస్తున్నాం. శిబిరాల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొనడం అభినందనీయం.

–అరుణ్‌కుమార్‌గౌడ్‌, హెచ్‌ఎం, అజీజ్‌నగర్‌ పాఠశాల

### సమ్మర్‌ క్యాంప్‌తో ఎంతో మేలు



ప్రభుత్వం సవి సెలవులు వృథా కాకుండా ఈ క్యాంప్‌ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. చదవడం, రాయడంతో పాటు కంప్యూటర్‌పై అవగాహన నేర్పించారు. బొమ్మలు వేయడం, ఆటలు, పాటల్లో శిక్షణ కల్పించారు. ఇలాంటి శిబిరాలు మాకు ఎంతో మేలు చేస్తాయి.

–పవన్‌కుమార్‌, ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

### ఇంకొన్ని రోజులు ఉంటే బాగుండు



వేసవి కాలంలో పాఠశాలకు సెలవులు ఇవ్వడం సాధారణమే అయినా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. వేసవి శిక్షణలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ శిక్షణలతో పాటు ఆరోగ్యంపట్ల మంచి అవగాహన కల్పించారు. దీంతో విద్యార్థులలో చెడు అలవాట్లకు పోకుండా మంచి క్రమశిక్షణను అలవడుతుంది. ప్రభుత్వం మరో వారం రోజులు పెంచితే బాగుంటుంది.

–అక్షిత, ప్రైవేటు పాఠశాల విద్యార్థి

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలో ఆదివారం బొడ్రాయి (నాభిశిల)తో పాటు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మదేవి దేవాలయంలో విగ్రహాలు, ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా సోమవారం నూతనంగా పునర్నిర్మించిన శ్రీశివరామాంజనేయస్వామి దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అనేగౌని దామోదర్‌గౌడ్‌, అనేగౌని పాండుగౌడ్‌, బుక్క వెంకట్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌, ఆర్‌.సాలయ్య, మంగలి మల్లయ్య, పాపగల్ల రాములు, చంద్రపాల్‌, పి.వెంకటేశ్‌, పి.మహేశ్‌, ఏ.శేఖర్‌ పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు